క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలు మంజూరైన నేపథ్యంలో చేపట్టిన ఐదు వందల మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పాండురంగన్న, వార్డు సభ్యుడు మద్దిలేటి పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తే చర్యలు



చనుగొండ్లలోని క్వారీలో గ్రానైట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం డోన్ మండలం చనుగొండ్లలోని పలు గ్రానైట్ క్వారీల్లో నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లా మైనింగ్ డీడీ విలేకరులతో మాట్లాడుతూ చనుగొండ్ల గ్రామంలోని కొన్ని గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారనే సమాచారం అందిందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా గ్రానైట్‌ను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ముర హరి, సర్వేయర్ సీతాబాయి సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: గ్రామాలలో జరుగుతున్న కులగణను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. మంగళవారం సి.బెళగల్ – 2 గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లారు. కులగణన వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జగనన్న కాలనీల ఇంటి స్థలాలకు సంబంధించి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయిస్తుందని, విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు.


వేలం పాటల్లో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

గడివేములు: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వ క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు మంగళవారం నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తాత్కాలికంగా కళింగర పండ్లు, చెరుకుగడలు, ఐస్, కూల్‌డ్రింక్స్ విక్రయాలకు, సప్లయర్ సామాను బాడుగకు ఇచ్చుకునేందుకు వేలంపాటలు నిర్వహించగా రూ.2,33,000 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది రూ.2,07,000 రాగా ఈ ఏడాది రూ.26 వేలు ఆదాయం పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వరరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, కుమారి పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఆదర్శ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు తిమ్మయ్య

కర్నూలు (టౌన్): ఈనెల 3, 4 తేదీల్లో భీమిలీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో స్థానిక ఆదర్శ విద్యామందిర్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన భరత్, రామ్‌చరణ్, సూరి, మహేష్‌బాబు అనే విద్యార్థులను ఆ సంస్థ వ్యవస్థాపకులు బి. తిమ్మయ్య అభినందించారు. విద్యార్థులకు పతకాలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మహబూబ్, సుభాని, సుదర్శన్ పాల్గొన్నారు.

కె.మార్కాపురం.. ప్రగతి పథం

- ఏళ్ల తరబడి నరకం చూపించిన రహదారులకు మోక్షం
- రూ.98 లక్షలతో గ్రామానికి రోడ్డు, పలు అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు



నాడు: గుంతలమయంగా కె.మార్కాపురం రోడ్డు,



నేడు: అందంగా తయారైన రహదారి

ఇది కదా.. అభివృద్ధి

కల్లూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడు గుంతలమయంగా ఉన్న రోడ్లను బాగు చేసిన దాఖలాలు లేవు. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏళ్ల తరబడి ప్రజలకు నరకం చూపించిన గ్రామీణ రహదారులు బాగుపడ్డాయి. రూ.98 లక్షలతో మండలంలోని కె.మార్కాపురం గ్రామానికి రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టింది.

కోడుమూరు రోడ్డు నుంచి పెద్దకొట్టాలకు రోడ్డు

గుంతల మయంగా ఉన్న కె.మార్కాపురం రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీఎమ్‌ఎఫ్(మైనింగ్) నిధులు, బీటీ పాట్‌హోల్స్ కింద నిధులు మంజూరు చేసి కోడుమూరు రోడ్డు నుంచి వయా కె.మార్కాపురం మీదుగా పెద్దకొటాల వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డును అభివృద్ధి చేసింది. దీంతో కె.మార్కపురం, పెద్దకొట్టాల గ్రామస్తులతో పాటు ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వీధి వీధినా రోడ్లు, కాలువలు.. ఇంటింటికీ కుళాయి

ప్రతి సచివాలయంకు వచ్చే గడప గడపకు మన ప్రభుత్వం రూ. 12లక్షల నిధులతో కె.మార్కాపురం గ్రామంలో డ్రైనేజీలు నిర్మించారు. రూ. 10లక్షలతో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 100 ఇళ్లకు కుళాయి కనెక్షన్ ఇచ్చారు. మండల నిధులతో ఎస్సీ కాలనీలో రూ. 4లక్షలతో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో త్వరలో రూ. 5లక్షల అంచనా వ్యయంతో సామూహిక మరుగుదొడ్లు నిర్మించనున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. మండల గ్రాంట్ రూ. 10లక్షలతో కె.నాగలాపురం రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మించారు. ఎన్ఆర్‌జీఎస్ గ్రాంట్ రూ.10లక్షలు, గ్రామ పంచాయతీ రూ.3లక్షలతో గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, గ్రావేల్ రోడ్లు వేశారు.



గ్రామంలో నిర్మించిన సీసీ డ్రైనేజీ కాలువ

ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చాం



గ్రామంలో రూ.10లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా 100 ఇళ్లకు కుళాయి కనెక్షన్ ఇచ్చాం. రూ. 12లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువలు నిర్మించాము. ఎస్సీ కాలనీలో రూ. 4లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువలు నిర్మించాం. త్వరలో ఎస్సీ కాలనీలో రూ. 5లక్షల వ్యయంతో సామూహిక మరుదొడ్లు నిర్మాణ పనులు చేపడతాం.

– శ్రీనాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కల్లూరు

ప్రయాణ కష్టాలు తీరాయి



గతంలో రోడ్డు గుంతల మయంగా ఉండేది. కోడుమూరు రోడ్డు నుంచి కె.మార్కపురం మీదుగా పెద్దకొట్టాల వరకు రోడ్డు వేయడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి. గతంలో గ్రామం నుంచి కోడుమూరు రోడ్డుకు వెళ్లాలంటే సుమారు 20 నిమిషాల సమయం పట్టేది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామానికి రోడ్డు నిర్మించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేయించారు. బీసీ కాలనీ నుంచి పర్ల రస్తా వరకు గ్రావేల్ రోడ్డు వేశారు.

– డి.శేఖర్, కె.మార్కాపురం.

మురుగు సమస్య పరిష్కారమైంది



గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడంతో మురుగు సమస్య తీరింది. రోడ్లు వేయక ముందు రోడ్డుపై మురుగు నిలిచి ఉండేది. దీంతో ఈగలు, దోమల బెడద ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడం లేదు. అలాగే రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు గ్రామంలోనే రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంటున్నాయి.

– మహబూబ్ బాషా, కె.మార్కాపురం

సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



మహిళకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది,



బాలుడికి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ ఫాతిమా

సి.బెళగల్: ప్రజారోగ్యానికి ప్రాధాన్యనిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మిథున్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని గుండ్రేవుల గ్రామం యూపీ స్కూల్‌లో మంగళవారం అధికారులు ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గ విజయ శ్రీ, డాక్టర్లు మిథున్‌రెడ్డి, ఫాతిమా, కంటి వ్యాధి నిపుణుడు సంపత్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. మొత్తం 352 మంది వైద్య సేవలు పొందారని డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు ఉమామహేశ్వరి, మంగమ్మ, మద్దిలేటి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి



పురుగుమందు దుకాణంలో రికార్డులు పరిశీస్తున్న ఏడీఏ గిరీష్

సి.బెళగల్: రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధ వాటికి డీలర్లు తప్పనిసరిగా రసీదులను ఇవ్వాలని కర్నూలు ఏడీఏ గిరీష్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఏఓ మల్లేష్‌కుమార్తో కలిసి మండలం కేంద్రం సి.బెళగల్ తోపాటు పోలకల్ గ్రామాల్లో పురుగు, ఎరువు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. పోలకల్‌లోని వేణు ట్రేడర్స్, సి.బెళగల్లోని ఓం మురళీ సాయి, శివ సాయి, నాగసాయి, దుకాణాలలో పురుగు మందుల అమ్మకాల రికార్డులను పరిశీలించారు. మందుల నిల్వలు, రికార్డుల్లోని వివరాలను తనిఖీ చేశారు. సి.బెళగల్లోని ఓం శ్రీ నాగసాయి ఎరువుల దుకాణంలో బస్తాలను తూకం వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందల అమ్మకాల రికార్డులు సరిలేకపోతే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేయాలని ఏఓకు సూచించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని లద్దగిరి పీహెచ్‌సీలో హెల్త్, ఆశా వర్కర్లతో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ప్రవీణ్‌కుమార్, పీసీపీఎన్‌డీటీ సెల్ లీగల్ కన్సల్‌టెంట్ సుమలత సమావేశం నిర్వహించారు. డా.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ లద్దగిరి పీహెచ్‌సీ పరిధిలో 0నుంచి5 సంవత్సరాల్లోపు చిన్నారులు 4990మంది ఉన్నారని, వారందరికి మార్చి 3వతేదీన పోలియో చుక్కలను తప్పక వేయించాలన్నారు. అలాగే ఈనెల 9వతేదీన నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లోని పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను తప్పక వేయలని సూచించారు. సమావేశంలో డాక్టర్లు జయంతి, భాస్కర్, శ్రీమంత్, సీహెచ్‌ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీనివాస యాదవ్, శారద, నరసప్ప, ఉమాభాయి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

11న ముస్లిం మైనార్టీల హక్కుల మహా గర్జన

కర్నూలు(అర్బన్): ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 11వ తేదీన మహా గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముస్లిం రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.షేక్ మహబూబ్ భాష, రోషన్ అలీ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ గర్జనను సాయంత్రం 4 గంటలకు పాత కంట్రోల్ రూమ్ సమీపంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 66 వేల ఎకరాల వక్ఫ్ భూములను రక్షించడంతో పాటు అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించి పేద ముస్లిం మైనార్టీలకు పంపిణీ చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన స్థలాల్లో షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌లు నిర్మించి ముస్లిం మైనార్టీలకు లీజుకు ఇవ్వాలన్నారు. ప్రత్యేక ముస్లిం మైనార్టీ కార్పొరేషన్లు పునరుద్ధరించి పేద ముస్లింలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఇలాంటి అనేక డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు చేస్తున్న ముస్లిం మైనార్టీల హక్కుల గర్జనకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరు కావాలని వారు కోరారు.

15న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు కేవీఆర్ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జి..ప్రమీల, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో దీపక్ తేజ హాస్పిటల్ అనస్తటిస్ట్ డాక్టర్ జయలక్ష్మినాయుడు సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్థులకు 'మహనీయుల జీవితం – మనకు అనుసరణీయం' (దేశ స్వాతంత్ర్య పోరాట యోధులు/దేశభక్తులు/సంఘ సంస్కర్తలు/ స్త్రీలు, పురుషులు) అనే అంశంపై పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రథమ బహుమతి రూ.2000, ద్వితీయ రూ.1500, తృతీయ బహుమతి రూ.1000 ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు ' వాడుకలో, బోధనలో, పాలనలో – మన తెలుగు' అనే అంశంపై పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ రూ.1000, తృతీయ బహుమతి రూ.750, ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94408 34017, 99667 53887 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నాటు సారా స్వాధీనం

గూడూరు: పట్టణంలో నీలి షికారి కాలనీలో మంగళవారం పోలీసులు సోదాలు నిర్వహించి 400 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఏసీ పీరయ్య తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. సెబ్ సిబ్బందితో కలిసి షికారీ కాలనీలో కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. దాదాపు 400 లీటర్ల ఐడీ వాష్ ప్లాస్టిక్ డ్రమ్ములో ఉండగా పగలగొట్టామన్నారు. నిందితుడు లాలు అనే వ్యక్తి పారిపోయాడని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఒక వైపే విద్యుత్‌లైన్ లాగాలి

పాణ్యం: పాణ్యం నుంచి సుగాలిమెట్ట వద్ద ఉన్న సంప్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కోసం లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ లైన్లను హైవేకు ఇరువైపులా కాకుండా ఒకేవైపు లాగాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఏఈ పుల్లయ్యని కలసి వినతిపత్రం అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే గదులను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పరిశీలించారు. కళాశాల ఆవరణలో ప్రత్యేక వాహనంలో గదులు, ఆవరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గదుల్లో ఉన్న సౌకర్యాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించి భద్రత సిబ్బంది, గదులు, సౌకర్యాలు తదితర వాటిపై క్లుప్తంగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసుల సిబ్బంది విధులు, కౌంటింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసే సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆశోక్‌కుమార్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పాణ్యం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కోటయ్య మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 1వ తరగతి నుంచి బీటెక్ చదివే విద్యార్థుల వరకు ఈ మాత్రలు ఉపయోగించవచ్చన్నారు. ఈనెల 9వ తేదీన మాత్రల పంపిణీ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలలకు మాత్రలు అందజేశామని చెప్పారు. మధ్యాహ్న భోజన అనంతరం ఈ మాత్రలు వేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇప్పటి వరకు 13,000 మాత్రలు మండలానికి వచ్చాయన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎర్రకత్వ గ్రామ పరిసరాలలో సారా బట్టీలపై దాడి చేసి 500 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉలిందకొండ ఎస్ఐ నరేష్, సిబ్బందితో కలసి ఎర్రకత్వ గ్రామం పరిసరాల్లో పర్యటించి, రెండు సారా బట్టీలపై దాడులు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా, అమ్మినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు త్యాగరాజ స్వామి ఆరాధన

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో బుధవారం సాయంత్రం 5 గంటలకు సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల విశ్రాంత సంగీత అధ్యాపకులు సి.సరస్వతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక కళాకారులతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: గ్రామాల్లో వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పనులు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను ట్రైనీ ఈఓ భరత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. కూలీల హాజరు, పనుల వివరాలపై ఆరా తీశారు. పీడీ మాట్లాడుతూ కూలీలంతా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.272 తగ్గకుండా పడుతుందన్నారు. కూలీలు ముందుకొస్తే వారికి ఉపాధి కింద అవసరమైన పనులు కల్పిస్తామన్నారు. అలాగే ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలు, మల్లె, గులాబీ తదితర పూల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ఆసక్తి గల రైతులు ముందుకొస్తే పండ్ల మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తీసుకునేందుకు, మొక్కల సరఫరా, నాట్లు, దుక్కి దున్నేందుకు, ఎరువులకయ్యే ఖర్చులు చెల్లిస్తామన్నారు. అదేవిధంగా ఎదిగే పండ్ల మొక్కలకు సంబంధించి నెలకు ఒక మొక్కకు రూ.25ల చొప్పున మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు సైతం ప్రభుత్వం చెల్లింస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పీడీ సూచించారు. పీడీ వెంట కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా ఉన్నారు.

నేటి నుంచి టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

గడివేముల: తిరుమల తిరుపతి దేవస్థానము, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం దేవాలయ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఆ మంచి వెంకటేశ్వర్లుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు, గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్వర రెడ్డి, అర్చకులు కేశవయ్య, రామేశ్వర రావు, కృష్ణమూర్తి, డీలర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ ఆర్‌ఐ సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు




గడివేములలో బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనోహర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బొల్లవరం రస్తాలో నూతనంగా వేస్తున్న బోరును, జగనన్న కాలనీలో పైపు లైన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలు రాకుండా గ్రామాల్లో ముందస్తుగా బోర్లు వేయడం జరుగుతోందన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించాలని ఏఈ పవన్‌ను కోరారు. మండల పరిషత్ నిధులతో ఎంపీటీసీ–2 తలారి మద్దమ్మకి కేటాయించిన నిధులతో బోర్లు వేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అనంతరం బిలకలగూడూరు గ్రామంలో జరుగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశం నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

భగవద్గీత సకల శాస్త్రాల సమన్వితం


- భక్తిశ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత సామూహిక పారాయణం



భగవద్గీత సామూహిక పారాయణం చేస్తున్న ధార్మిక సంస్థల సభ్యులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత సకల శాస్త్రాల సమన్వితమని గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ అన్నారు. పుష్య బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో మంగళవారం సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ధార్మిక సంస్థల సమన్వయంతో గీతా ప్రచార సంఘం సభ్యులు సామూహికంగా కలిసి 701 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ భగవద్గీతను ఆశ్రయిస్తే జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్లను అధిగమించవచ్చున్నారు. అటువంటి భగవద్గీత వ్యాప్తికి అన్ని విద్యాసంస్థలు, ధార్మిక సంస్థలు, దేవస్థానాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం కార్యదర్శులు ఎస్.జగన్నాథ్ గుప్తా, అనంత అనిల్‌కుమార్, ఇల్లూరు వెంకటరమణ, సింహాద్రి రమేష్, శ్రీసాయి బాబా భక్త మండలి ప్రధాన కార్యదర్శి ఎస్‌జీ మహాబలేష్, విష్ణు సహస్రనామ పారాయణ సంఘం అధ్యక్షుడు మల్లెల పుల్లారెడ్డి, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ అంబటిపూటి శ్రీమహాలక్ష్మి, అనూషతో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, గీతా ప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణ రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



గోల్డ్‌మెడల్స్ సాధించిన నాగార్జున, గఫూర్ మియా

కర్నూలు కల్చరల్: విజయవాడలో నిర్వహించిన 24వ కృష్ణ రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో (ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలు) జిల్లా స్విమ్మర్లు ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 433 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన అసెంట్యూర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అసోసియేట్ మేనేజర్ పొలుక నాగార్జున రాయల్ 30 ఏళ్ల వయసు విభాగంలో 1.5 కిలోమీటర్ల ఈవెంట్‌ను 21.01 నిమిషాల్లో స్విమ్మింగ్ చేసి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. న్యాయవాది బి. గఫూర్ మియా 60 ఏళ్ల వయసు విభాగంలో 1.5 కిలోమీటర్ల ఈవెంట్‌ను 25.29 నిమిషాల్లో స్విమ్మింగ్ చేసి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. వీరు ఇరువురు కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ సాధన చేస్తారు. వీరికి మాజీ ఎంపీ గోకరాజు రంగరాజు, ఇండియా క్రికెట్ టీం మాజీ సెలెక్టర్ ఎమ్ఎస్‌కే ప్రసాద్ మెడల్స్ ప్రదానం చేశారు. డీఎస్‌డీఓ శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, మాస్టర్ స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అభినందించారు.